పెద్దమందడి సర్పంచ్ గంగమ్మకు పరీక్ష!

2





నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

సోమవారం 30, మార్చి 2026 పేజీలు:4




# డ్రైవర్ల ఆరోగ్యమే.. సమాజానికి రక్ష

## ఎస్సై చిలువేరు ప్రమోద్ కుమార్ గౌడ్



**పెద్దవంగర, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-మార్చి 29:**

రోడ్డు రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత కలిగిన డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్సై చిలువేరు ప్రమోద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పోలీసుల ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొర్రూరుకు చెందిన సాయి సిరి ఆప్టికల్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, డ్రైవర్లు కేవలం శారీరక ఆరోగ్యంపైనే కాకుండా మానసిక ప్రశాంతతపై కూడా దృష్టి సారించాలని ఒక అద్భుతమైన విషయాన్ని గుర్తుచేశారు. నిరంతరం స్టీరింగ్ పట్టి ఒత్తిడితో వాహనాలు నడిపే క్రమంలో ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉందని, అందుకే ప్రతిరోజూ కనీసం పది నిమిషాల పాటు ధ్యానం లేదా ప్రాణాయామం చేయడం వల్ల మానసిక దృఢత్వం పెరుగుతుందని వివరించారు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడే రోడ్డుపై ఎదురయ్యే ఆకస్మిక ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి విశ్రాంతి, సరైన ఆహారం తీసుకోవాలని, షుగర్, బీపీ వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడం అవసరమని సూచించారు. నిత్యం 20 నుండి 30 నిమిషాల పాటు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల శరీరం దృఢంగా ఉంటుందని తెలిపారు. అతివేగం, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, డ్రైవింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్, మెరుగైన ఆరోగ్యం ఉంటేనే ప్రతి డ్రైవర్ భద్రంగా తన ఇంటికి చేరుకుంటారని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు ఎనగందుల సంతోష్ కుమార్, కాగు నవీన్, మురళి, పోలీస్ సిబ్బంది సుధాకర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

---

# తెలుగు జాతి ఆత్మగౌరవానికి పత్రీక టీడీపీ

## మండలాధ్యక్షుడు బైన బిక్షపతి



**పెద్దవంగర, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-మార్చి 29:**

తెలుగు ప్రజల గుండెచప్పుడు తెలుగుదేశం పార్టీ అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఒక గుర్తింపును, ఆత్మగౌరవాన్ని తెచ్చిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకే దక్కుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు బైన బిక్షపతి, మాజీ ఎంపీపీ సంగాని శంకర్ రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అవుతాపురం గ్రామంలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకుని చరిత్ర సృష్టించిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్ళతో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా పార్టీ ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. సామాన్యులను సైతం అసామాన్య నాయకులుగా తీర్చిదిద్దిన చరిత్ర ఈ పార్టీకి ఉందని, నేటి యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ సేవ చేయాలనుకుంటే టీడీపీ ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశ యాలను గుండెల్లో నింపుకుని, ప్రజా సమస్యల పరి ష్కారం కోసం రాబోయే రోజుల్లో మరింత బలంగా ప్రజల మధ్య నిలిచి పోరాడుతామని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ఉంటూ పార్టీ బలోపేతా నికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు బైన వినోద, నాయకులు గద్ద లింగయ్య, పగిడిపాల ఎల్లయ్య, ఆవుల రాజు, కోట సోమరాజు, కత్తుల కొమురయ్య, బోదేపల్లి ఉప్పలయ్య, గద్ద ఎల్లయ్య, ఎండీ యాకుబ్ పషా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మకు అక్షరమాల

-అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యం.

-1610 మంది పరీక్షలు రాసిన అమ్మలు.

-పరీక్షా కేంద్రాల్లో దగ్గరుండి సహకరించిన సర్పంచులు.

-పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించిన ఏపిఎం సక్రు నాయక్.





వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యమని ఏపిఎం సక్రు నాయక్ అన్నారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యా,సాధికారతను అందించేందుకు ఇందిరా మహిళా శక్తి లో భాగంగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలకు ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, బుక్ కీపర్ లు సహకరించడం అభినందనీయమన్నారు. మండలంలో 1750 మంది నిరక్షరాస్యులు ఉండగా పరీక్షకు 1610 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను తనతో పాటు ఎమ్మెస్ ఓబి, వివో ఏలు, సీసీలు పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.



---



# అక్షర స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

## -కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు భద్రత లేదు

## -పాఠశాల రద్దుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి జిల్లా కేంద్రంలోని అక్షర పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని మాజీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బి నాయకులతో కలిసి మాజీమంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్షర పాఠశాలలో మైనారిటీ బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించిన దుండగుడిని కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. బాధిత కుటుంబం తరపున న్యాయం కోసం కొట్లాడిన వారిపై కేసులు నమోదు చేయడం పోలీసులకు తగదన్నారు. రాష్ట్రంలో మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం భద్రత కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై తిరిగిన ఉదంతాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేసిన పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాఠశాల గుర్తింపు రద్దు చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మైనారిటీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్, సయ్యద్ జమీల్, ఇమ్రాన్, అస్లాం, ఆరీఫ్, ఫజల్, ఏకే పాషా, అలీమ్, అర్షద్, సాజీద్, నజీరుద్దీన్, చిన్ని మియా, అక్రమ్, వాజీద్, నయూమ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

---



# పెద్దమందడి సర్పంచ్ గంగమ్మకు 'పరీక్ష'!

పెద్దమందడి నేటి ఫోకస్ న్యూస్:

పెద్దమందడి గ్రామ సర్పంచ్ గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వం 'పరీక్ష' పెట్టింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మకు అక్షరమాల'కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహిళా నిరక్షరాస్యులకు నిర్వహించిన ప్రత్యేక పరీక్షలో ఆమె పాల్గొని అక్షరాస్యురాలిగా నిరూపించుకున్నారు. చదువుకోవడానికి వయసుతో సంబంధం లేకుండా అక్షరాస్యత ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటా ఒక చదువుకున్న తల్లి ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో పెద్దమందడి మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అయిన గంగమ్మ ఆదివారం తన స్వహస్తాలతో పరీక్ష రాసి ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేశారు. పరీక్షల నిర్వహణలో ఏపిఎం సక్రు నాయక్ ప్రత్యేక శ్రద్ధ వహించి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ప్రయత్నం సఫలీకృతమైంది.

---

# ఉల్లాస్ పరీక్షలో 895 మంది మహిళల హాజరు

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 29

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షకు మొత్తం 895 మంది మహిళలు హాజరయ్యారు. మండలంలోని వివిధ పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్, ఏపీఎం ఎండి మహబూబ్ పాషా కలిసి సందర్శించి నిర్వహణను పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంపూర్ణ అక్షరాస్యత సాధన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యా అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా 15 సంవత్సరాల పైబడిన వారికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు అందించడంపై దృష్టి సారించినట్లు



చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారుతోందన్నారు.

అక్షరాస్యత పెంపు వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా దేశ ఆర్థిక, సామాజిక పురోగతికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు సుధాకర్, సుజాత, ఉమా, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

---

# అమ్మాపురంలో ఘనంగా పారువేట ఉత్సవాలు



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 29

తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆదివారం పారువేట ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రంగులతో అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లకు స్థానిక సర్పంచ్ ముద్దం సునీత వీరారెడ్డి, ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డిల చేతుల మీదుగా మొదటి బహుమతి బూరుగు వీరేష్ గౌడ్, రెండవ బహుమతి వడ్లకొండ అశోక్ గౌడ్, మూడవ బహుమతి బూరుగు కుమార్ గౌడ్ లు అందుకున్నారు. అదే విధంగా మిగతా ఎడ్ల బండ్లకు సైతం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

---

# మహనీయుల జీవితం అందరికీ ఆదర్శం

## -సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్.



వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

మహనీయుల జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వచ్చే ఏప్రిల్ నెలలో బాబు జగ్జీవన్ రామ్,డా.బి.ఆర్. అంబేద్కర్ మున్నగు మహనీయుల జయంతులు ఉన్నందువల్ల ఇటీవల ఆ ఉత్సవ కమిటీని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కమిటీ కన్వీనర్ గా గంధం నాగరాజును ఎంపిక చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని సాహితీ కళా వేదిక పక్షాన ఆదివారం స్థానిక రేడియంట్ హై స్కూల్ లో శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం తపించిన ఆనాటి మహనీయులు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకులని,వారి మార్గం అనుసరణీయం అని అన్నారు.గంధం నాగరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరగాలని కళా వేదిక ప్రతినిధులు తమ ఆకాంక్షను తెలిపారు . ఈనాటి కార్యక్రమంలో సూర చంద్ర శేఖర్, దేశి రాములు యాదవ్,బైరోజు చంద్ర శేఖర్,బండారు శ్రీనివాసులు,మీసాల రాములు,పెరుమాళ్ళ శ్రీనివాసులు,నారాయణ,తదితరులు పాల్గొన్నారు.